క్లుప్తంగా

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



కుళాయిల వద్ద కాంక్రీట్ దిమ్మలు ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. మూలపేటలో వీధి కుళాయిల వద్ద జరుగుతున్న కాంక్రీట్ దిమ్మల నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే పాలకవర్గం దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొల్లేటి గంగాధర్, వార్డు సభ్యులు ఆడారి సత్యనారాయణ, మొల్లేటి గోవిందరావు, ఆడారి అమ్మాజీ, కాండ్రేగుల శ్రీనివాసరావు, పాల సంఘ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పరిశీలన



సీతారాంపురం సచివాలయం లో రికార్డులు పరిశీలిస్తున్న ఈవోఆర్డీ

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇటీవల కాలంలో నిర్వహించిన స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్నట్లు ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. అరట్లకోట, సీతారాంపురం, గుంటపల్లి గ్రామ సచివాలయాలను పరిశీలించి స్వామిత్వ సర్వే రికార్డులు, ఇంటి పన్నుల వసూలు రికార్డులు, చెత్త నుంచి సంపద కేంద్రాల అభివృద్ధిపై ఆయా గ్రామ సచివాలయ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు.

అనుమతుల్లేని లేఅవుట్‌పై చర్యలు



పొక్లెయిన్‌తో తవ్వేసిన రాజధాని గ్రీన్ సిటీకి వెళ్లే రోడ్డు

మునగపాక: మునగపాక సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న రాజధాని గ్రీన్‌సిటీ లేఅవుట్‌పై బుధవారం అధికారులు చర్యలు చేపట్టారు. వీఎంఆర్డీఏ అనుమతులు లేకుండా లేఅవుట్ పనులు జరుగుతున్నాయంటూ ఇందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మునగపాక పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పంచాయతీ అధికారులు పొక్లెయిన్ సాయంతో లేఅవుట్‌కు వెళ్లే రోడ్డును తవ్వించారు. అనుమతులు లేకుండా లేఅవుట్ ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయానికి సీసీ కెమెరాల వితరణ



ఉత్సవ కమిటీ సభ్యులకు సీసీ కెమెరాలు అందిస్తున్న యువకులు

ఎస్.రాయవరం: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బంది పనికి సమానంగా సమాచారాన్ని భద్రపరుస్తోందని గోకులపాడు యువకుడు మత్తి కార్తీక్ అన్నారు. గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయానికి రూ.10 వేలు విలువ చేసే సీసీ కెమెరాలను బుధవారం అందజేశారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ ఆలయానికి రక్షణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మాలెం శ్రీనివాసు, కలిగట్ల నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ కార్డుల కోసం పేర్ల నమోదు



జెడ్సీ రమణ

అనకాపల్లి టౌన్: పట్టణ పరిధిలో 60 ఏళ్లు దాటిన వృద్ధులంతా సీనియర్ సిటిజన్ కార్డుల కోసం సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ రమణ తెలిపారు. సీనియర్ సిటిజన్ కార్డుతో ఆర్టీసీ బస్సుల్లో రాయితీ, ప్రభుత్వం అందించే మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చన్నారు. కార్డు పొందాలనుకునే వారు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ లింక్ ఫోన్ నంబర్, బ్లడ్ గ్రూప్, ఎమర్జెన్సీ కాంట్రాక్టు నంబర్ తదితర వివరాలు తెలపాలని కమిషనర్ సూచించారు.

బాక్స్ క్రికెట్.. నయా ట్రెండ్!



జీరకాయలపాలెం వద్ద బాక్స్ క్రికెట్ కోర్టులో ఆడుతున్న యువకులు

క్రికెట్ అంటే 11 మంది క్రీడాకారులు, భారీ మైదానం, ఇరువైపులా ఏర్పాటు చేసేందుకు ఆరు వికెట్లు, బంతి, బ్యాట్లు, ప్యాడ్లు, గ్లౌజ్, హెల్మెట్ ఇలా అనేక రకాల సామగ్రి సమాహారం. ఈ వ్యవహారమంతా గతం. ఇప్పుడు పరిస్థితి మారింది. ఆయా వస్తువులు ఏవీ లేకపోయినా సరే సరదాగా వెళ్లి నచ్చినంతసేపు ఆడేసుకోవచ్చు. ప్యాంటు, షర్టు, అవకాశముంటే షూస్ వేసుకుని వెళ్తే సరిపోతుంది. జట్టుకు అవసరమైన 11 మంది సభ్యులు అవసరం లేదు. ఇద్దరు, ముగ్గురితోనే సర్దుకుపోవచ్చు. ఎందుకంటే హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం లాంటి నగరాలకే పరిమితమైన బాక్స్ క్రికెట్ పల్లెల్లోనూ అందుబాటులోకి వచ్చింది.



- పల్లెల్లో బాక్స్ క్రికెట్‌కు ఆదరణ
- కాలక్షేపంతో పాటు వ్యాయామం
- ఆట సమయాన్ని బట్టి ధరలు
- ఫ్లడ్ లైట్ల వెలుతురులో క్రికెట్ ఆడే సౌలభ్యం
- యలమంచిలి, లైను కొత్తూరులో బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ల ఏర్పాటు



ఫ్లడ్ లైట్ల వెలుతురులో క్రికెట్ ఆడుతూ..

యలమంచిలి రూరల్: మన దేశంలో క్రికెట్‌కు ఉన్న క్రేజ్ అంతా.. ఇంతా కాదు. ఖాళీ సమయం దొరికితే చాలు క్రికెట్ ఆడుతుంటారు. అప్పట్లో ఆటలు ఆడేందుకు గ్రామాల్లో, పట్టణాల్లో పెద్ద, పెద్ద మైదానాలు ఉండేవి. కానీ రాను రానూ గ్రామాలతో పాటు పట్టణాల్లో స్థలాల విలువ పెరగడంతో ఆట స్థలాలు లేకుండాపోయాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా మైదానాలు కనుమరుగవుతుండడంతో పిల్లల చేతుల్లోకి స్మార్ట్ ఫోన్ వచ్చి చేరింది. ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా ప్రతి పిల్లవాడి చేతిలో ఫోన్ ఉండాల్సిందే. యూట్యూబ్ చూడటం, ఫోన్‌లోనే ఆటలు ఆడడం తప్ప శరీరానికి ఉపయోగపడే ఆటలు ఆడటం మరిచిపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని యలమంచిలి ప్రాంతంలో బాక్స్ క్రికెట్ గ్రౌండ్లు ఏర్పాటు చేస్తున్నారు కొందరు. యలమంచిలి పట్టణానికి సమీపంలో, లైనుకొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో రెండు బాక్స్ క్రికెట్ కోర్టులు ఏర్పాటయ్యాయి. ఫ్లడ్ లైట్ల వెలుతురులో ఆడే అవకాశం ఉండడంతో బాక్స్ క్రికెట్‌కు రోజురోజుకూ క్రేజ్ పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని వయసుల వారు అక్కడ క్రికెట్ ఆడుతూ సందడి చేస్తున్నారు.

బాక్స్ క్రికెట్ విశేషాలు

చిన్నపాటి కోర్టులో(పొడవు 25–30 మీటర్లు, వెడల్పు 15 మీటర్లు, ఎత్తు 12 మీటర్లు) ప్లాస్టిక్‌తో తయారైన గడ్డిని నేలపై పరిచి.. పైపుల సాయంతో నెట్‌ను అమర్చుతారు. పిచ్‌కు నాలుగువైపులా నెట్, చుట్టూ సరిపడా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. బ్యాట్స్‌మెన్ కొట్టిన బంతి నెట్ దాటి బయటకు వెళ్లే అవకాశం ఉండదు. బాక్స్‌లో ఎదురుగా ఉన్న నెట్‌ను నేరుగా బంతి వెళ్లి తాకితే సిక్స్, స్టెప్పులు పడుతూ వెళ్లి తాకితే బౌండరీ, పైకప్పుకు తగిలితే ఔట్, సింగిల్స్, డబుల్స్, రనౌట్‌లు, క్యాచ్‌లు అన్నీ సాధారణ క్రికెట్ తరహాలోనే ఉంటాయి. ఇక్కడ ఆడేందుకు గంటకు రూ.650 వరకు వసూలు చేస్తున్నారు. ఒకేసారి రెండు, మూడు గంటలు ఆడితే ప్రతి అదనపు గంటకు రూ.50 చొప్పున తగ్గిస్తున్నారు. వీకెండ్స్, సెలవుల్లో బాక్స్ క్రికెట్ కోర్టులు చాలా బిజీగా ఉంటున్నాయి. కొన్నిసార్లు బాక్స్ క్రికెట్ కోర్టుల్లోనే టోర్నమెంట్లు సైతం నిర్వహిస్తుండడం విశేషం.



యలమంచిలి సమీపంలో గాజువాక బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ గ్రౌండ్

వారంలో ఒకసారి వెళ్తుంటాం..



చిన్నప్పటి నుంచీ క్రికెట్ అంటే చాలా ఇష్టం. ఆడేందుకు మైదానాలు లేకపోవడంతో నిరాశగా ఉండేది. ఇటీవల బాక్స్ క్రికెట్ గ్రౌండ్లు అందుబాటులోకి రావడంతో స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుకుంటున్నాం. ఎక్కువ మంది ఆడితే అందరూ కలిసి తలా కొంత వేసుకుని చెల్లిస్తున్నాం. దీని వల్ల ఆడే వారికి పెద్దగా భారం అనిపించడం లేదు. బాక్స్ క్రికెట్ కొత్తగా, సౌకర్యవంతంగా ఉంటోంది. మేమంతా వారానికొక్కసారి తప్పనిసరిగా బాక్స్ క్రికెట్ ఆడుతాం.

– కొల్లి ఉమామహేష్, పెనుగొల్లు

వినూత్నమైన అనుభూతి



ఒకప్పుడు మెట్రోపాలిటిన్ నగరాలకే పరిమితమైన బాక్స్ క్రికెట్ పల్లెల్లోనూ ఏర్పాటవుతున్నాయి. ఇక్కడ ఆడడం ఒక వినూత్నమైన అనుభూతినిస్తోంది. ముఖ్యంగా ఫ్లడ్ లైట్ల వెలుతురులో ఆడడం ఇంకా బాగుంది. ఎక్కువ దూరం పరుగెత్తాల్సిన అవసరం కూడా ఉండదు. చిన్నపాటి మైదానంలో బ్యాటింగ్, బౌలింగ్ చేయడానికి ఎంతో సౌకర్యంగా ఉంటోంది. బాక్స్ క్రికెట్‌తో స్నేహితుల మధ్య అనుబంధాలు పెరుగుతున్నాయి.

– కంటంరెడ్డి సాయి కుమార్, యలమంచిలి

బ్రిడ్జి కోర్సుతో సత్ఫలితాలు



పాఠ్య పుస్తకాలతో విద్యార్థులు, లెక్చరర్లు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎ.ఆర్.టి.సుజాత తెలిపారు. బ్రిడ్జి కోర్సుకు హాజరవుతున్న విద్యార్థులకు బుధవారం పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వేసవి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ఇందుకు మంచి స్పందన వస్తోందన్నారు. మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నామని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో వివిధ గ్రూపుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. నిష్ణాతులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యను అందిస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేట్ కళాశాలల మోజులో పడి డబ్బులు పోగొట్టుకోవద్దని, ప్రభుత్వ కళాశాలలో ఉచితంగానే విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి జనవాణి కార్యక్రమం ద్వారా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పేర్కొన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రామాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, ఎంపీడీవో ఎం.ఉషారాణి, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్ష

రాంబిల్లి(అచ్యుతాపురం): వేసవి తీవ్రత దృష్ట్యా రాంబిల్లి మండలంలో మంచి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జయమాధవి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పురోగతిలో ఉన్న సర్వేల ప్రగతి గురించి ఆరా తీశారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు, వేతనాల సరాసరి లక్ష్యాలు పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ ఉద్యోగుల హాజరు శాతంపై పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు, ఇతరత్రా సంక్షేమ కార్యక్రమాల విషయంలో కార్యదర్శులు శత శాతం లక్ష్య సాధన, పారదర్శకత ఉండేలా చొరవ చూపాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయానికి సన్నద్ధం చేయాలి



ప్రకృతి వ్యవసాయంపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏడీ ఉమాప్రసాద్

పాయకరావుపేట: ప్రతి గ్రామంలోను ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను సిబ్బంది సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ ఏడీ కె.ఉమాప్రసాద్ సూచించారు. పాయకరావుపేట రైతు సేవా కేంద్రంలో పాయకరావుపేట, నక్కపల్లి మండలాలకు చెందిన వ్యవసాయ శాఖ సిబ్బందితో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి 35 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుకు సన్నద్ధం చేయాలన్నారు. రైతులకు యంత్రీకరణ, వేసవి అపరాలు, డ్రోన్, తదితర విషయాలపై సిబ్బందికి వివరించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ, వ్యవసాయ శాఖ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకురాలికి పరామర్శ



అడపా శ్రావణిని పరామర్శిస్తున్న నాయకులు

పాయకరావుపేట: మంగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు అడపా శ్రావణి(రమ్య)ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు బుధవారం పరామర్శించారు. శ్రావణి తండ్రి అడపా బాబ్జి అనారోగ్యం కారణంగా రెండు రోజుల క్రితం మృతి చెందారు. ఈ మేరకు శ్రావణిని చిక్కాల పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ జిల్లా ప్రచార విభాగం మాజీ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పాయకరావుపేట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దేవవరపు రాజేష్ ఖన్నా, పార్టీ నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు, కోనే పుత్రరావు, పెనుమత్స నాగేశ్వరరావు, దేవవరపు నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

గణితంలో ప్రతిభ చూపితే ఉజ్వల భవిష్యత్



గణితం ప్రతిభ పరీక్షలో విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

యలమంచిలి రూరల్: పాఠశాల స్థాయిలో విద్యార్థులు గణితంలో రాణిస్తే మిగిలిన సబ్జెక్టుల్లో సునాయాసంగా ప్రతిభ చూపే అవకాశం ఉంటుందని జంపపాలెం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణారావు అభిప్రాయపడ్డారు. మండలంలోని జంపపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన గణితం ప్రతిభ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, జీకే పుస్తకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది బొడ్డేటి సత్యనారాయణ, నాగరాజు, చిట్టిరాజు, శివ, సుధాకర్, సుబ్బారావు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న మునగపాక ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తున్న మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావుకు పురస్కారం లభించింది. బుధవారం జరిగిన క్రైమ్ సమావేశంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నుంచి బుధవారం ఆయన ప్రశంసా పత్రం అందుకున్నారు. పలు కేసులకు సంబంధించి సాధించిన పురోగతిలో భాగంగా ఎస్ఐ ప్రసాదరావు చేసిన కృషికి ఈ ప్రశంసా పత్రం లభించింది. రానున్న రోజుల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఎస్పీ సిన్హా సూచించారని ప్రసాదరావు తెలిపారు.

తిమ్మరాజుపేట పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

అచ్యుతాపురం: తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి బుధవారం గ్రామ నాయకులు శంకుస్థాపన చేశారు. రూ.13 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ అలేటి వరలక్ష్మి, శివ బాపునాయుడు, మళ్ల చిన్నబాబు, కర్రి భద్రరాజు, రేవిడి కృష్ణ, కర్రి వెంకునాయుడు, వెలగా అచ్చింనాయుడు, శరగడం నారాయణమూర్తి, వీరభద్రరావు, పాఠశాల హెచ్ఎం మారిశెట్టి వెంకట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బకాయిల కోసం ఉపాధి కూలీల నిరసన



ఎస్.నర్సాపురం వద్ద కూలీలతో కలిసి నిరసన తెలుపుతున్న కూలీలు, రైతు సంఘ నాయకులు

నక్కపల్లి: మండుటెండలో ఉపాధి పనులకు వెళ్తున్న తమకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పలువురు ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎస్.నర్సాపురంలో పనులు చేసే చోట కూలీలంతా నిరసన వ్యక్తం చేశారు. పథకం కింద ప్రతి రోజు పనుల్లోకి వెళ్తున్నామని, వేతనాలు మాత్రం నెలల తరబడి చెల్లించడం లేదని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఏమీ లేకపోవడంతో ఉపాధి హామీ పథకం కింద చెరువుల్లో పూడిక తీత, గట్లు పటిష్టం, పంట కాలువల నిర్మాణం, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేస్తున్నామన్నారు. నాలుగైదు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని చెల్లించడం లేదని లబ్ధిదారులు ఆరోపించారు. మండలంలో 33 పంచాయతీల్లో సుమారు 8 వేల మందికి పైగా జాబ్‌కార్డు కలిగిన వారు ఉన్నారు. ప్రతి గ్రామంలోను ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఉదయం ఆరు గంటల నుంచే కూలీలు పనులకు హాజరవుతున్నారు. రోజుకు వేతనం రూ.307 గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పిస్తున్నట్టు అధికారులు చెబుతున్నప్పటికీ.. ఆ స్థాయిలో వేతనాలు రావడంతో లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. రూ.150లకు మించి వేతనం అందడం లేదని చెబుతున్నారు. కూలీలకు వేతనాలు చెల్లించని విషయం తెలుసుకున్న జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సీఐటీయూ మండల కన్వీనర్ మనబాల రాజేష్ నర్సాపురంలో పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. కూలీలకు మద్దతుగా ఆందోళన చేశారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రూ.80 కోట్ల మేర ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని చేసిన 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి కూలీల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ఎన్నికల ముందు ఇస్తామన్న రైతు భరోసా, అమ్మఒడి వంటి పథకాలు సైతం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పనులకు వేతనాలను సకాలంలో చెల్లించకపోతే కూలీలు ఎలా బతుకుతారని నిలదీశారు. బకాయి వేతనాలు చెల్లించకపోతే త్వరలో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కొత్త రకం వంగడాల సాగుపై సర్వే



వమ్మవరం గ్రామంలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శచీదేవి

ఎస్.రాయవరం: రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని డీఆర్డీఏ పీడీ శచీదేవి అన్నారు. వమ్మవరం గ్రామంలో బుధవారం ఆమె పర్యటించారు. ఇప్పటికే ఏర్పాటైన రైతు ఉత్పాదక సంఘాల సభ్యులకు కొత్త రకం వంగడాలు సాగు చేసే ప్రక్రియపై సర్వే చేస్తున్నట్టు ఆమె చెప్పారు. కొబ్బరి సాగు ప్రాంతాల్లో అనుసంధాన ఉత్పత్తుల నుంచి చేపట్టే పనులపై రైతులతో చర్చించారు. అయితే అధికారులకు భిన్నంగా రైతులు సమాధానం చెప్పారు. గడిచిన ఐదారు నెలలుగా కొబ్బరికి తెల్లదోమ సోకి తీవ్రంగా నష్టం వాటిల్లుతోందని, రైతులను ఆదుకునే ప్రక్రియ చేపట్టాలని పీడీకి రైతులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలపర్తి పాపారావు, ఎంపీటీసీ బాలం సూరిబాబు, మాజీ ఎంపీటీసీ పల్లేల జగ్గారావు, ఏపీఎం శివప్రసాద్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నరేంద్రపురంలో ఉపాధి పనుల ప్రారంభం



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న నాయకులు

అచ్యుతాపురం: మండలంలోని మల్లవరం శివారు నరేంద్రపురంలో బుధవారం గ్రామీణ ఉపాధి హామీ పనులను సర్పంచ్ పిన్నమరాజు వాసు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రావి నాగలక్ష్మి, రావి శోభన్ బాబు, రావి కాసు, తదితరులు పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

కశింకోట: తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.గ్రేస్ తెలిపారు. 5వ తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.